ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు

శనివారం 30 మార్చి 2024





ఖాద్రీశుడి వైభోగం చూతము రారండి

- నేడు బ్రహ్మ రథోత్సవం
- తరలిరానున్న భక్తజనం
- అదనపు పోలీసు బలగాలతో భద్రతా ఏర్పాట్లు

వివరాలు 7లో

గెలుపు మనదే..

అందరినీ కలుపుకుని ముందుకెళ్లండి

చంద్రబాబు దిశానిర్దేశం



హెలీప్యాడ్‌లో చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న బీవీ, కందికుంట, పల్లె

పుట్టపర్తి, మార్చి 29(ఆంధ్రజ్యోతి): 'గెలుపు మనదే.. అందరినీ కలుపుకుని వ్యూహాత్మకంగా అడుగులు వేయాల'ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు.. నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రజాగళం యాత్రంలో భాగంగా గురువారం కదిరికి వచ్చిన చంద్రబాబు రాత్రి పట్టణంలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం పీవీఆర్ కల్యాణ మండపం వద్ద టీడీపీ కదిరి అభ్యర్థి కందికుంట వెంకట ప్రసాద్, పుట్టపర్తి ఇన్‌చార్జి పల్లె రఘునాథ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు, జిల్లా పరిశీలకుడు కోవెలమూడి రవీంద్రతోపాటు కదిరి నేతలను వేర్వేరుగా బస్సులోకి పిలిచి చంద్రబాబు మాట్లాడారు. హిందూపురం ఎంపీతోపాటు ఏడు నియోజకవర్గాల్లో టీడీపీ గెలవబోతోందన్నారు. ఆయా నియోజకవర్గాల్లో అందరినీ కలుపుకుని ప్రచారం సాగించాలన్నారు. కందికుంట వెంకటప్రసాద్, పల్లె రఘునాథ రెడ్డితో చంద్రబాబు ప్రత్యేకంగా మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఆయా నియోజకవర్గాల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సూచనలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులను ఏకతాటిపైకి తెచ్చి, గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. జిల్లాలో సమన్వయంతో పనిచేసి, అందరినీ కలుపుకెళ్లి దూకుడుగా ప్రచారం చేయాలని బీవీ వెంకటరాముడుకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో వైసీపీ కుయుక్తులను ఎండగట్టి, ఎక్కడా తగ్గకుండా అన్నివర్గాల ప్రజల మద్దతు కూడగట్టి టీడీపీ గెలుపులో భాగస్వాములను చేయాలన్నారు. అనంతరం చంద్రబాబు నంద్యాల జిల్లా బనగానపల్లి పర్యటన నిమిత్తం హెలీకాప్టర్‌లో బయల్దేరి వెళ్లారు. హెలీప్యాడ్ వద్ద చంద్రబాబుకు పల్లె, కందికుంట, బీవీ, నేతలు కృష్ణమోహన్ నాయుడు, చక్రవర్దన్ రెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్ వీడ్కోలు పలికారు.

కదిరికి కందికుంటే..

ఎమ్మెల్యే అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్



కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్

కదిరి, మార్చి 29: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కదిరి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్‌ను ఎంపిక చేశారు. కదిరి అభ్యర్థిగా కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోదాదేవిని కొన్నిరోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. కందికుంట వెంకటప్రసాద్‌పై ఉన్న కేసులు కొట్టి వేస్తూ ఇటీవల కోర్టు తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో టీడీపీ శుక్రవారం కందికుంట వెంకటప్రసాద్‌ను కదిరి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించింది. కందికుంట వెంకటప్రసాద్ 2003 నుంచి కదిరి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. 2004లో కదిరి టీడీపీ టిక్కెట్ ఆశించారు. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. 2009లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి, దాదాపు 15వేల మెజార్టీతో గెలుపొందారు. 2014, 2019లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2024లో తిరిగి టీడీపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు. 20 సంవత్సరాలుగా టీడీపీలో కొనసాగుతున్నారు. నాలుగుమార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. నాయకులు, కార్యకర్తలు కష్టనష్టాలో పాలు పంచుకున్నారు. ఎన్ని ఒడుదుడుకులొచ్చినా నియోజకవర్గంలో పార్టీని ఏకతాటిపై నడిపిస్తున్నారు. కందికుంట వెంకటప్రసాద్ అనేక సేవా, ధార్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఎంతోమందికి విద్య, వైద్య సాయం అందించారు. కందికుంట నారాయణమ్మ ట్రస్టు పేరుతో సేవలందిస్తున్నారు. పార్టీలకతీతంగా నియోజకవర్గంలో అభిమానించే నాయకుడిగా కందికుంటకు పేరుంది.

కందికుంట వెంకటప్రసాద్ ప్రొఫైల్

పేరు: కందికుంట వెంకటప్రసాద్
తల్లిదండ్రులు: కందికుంట రఘురామప్ప, నారాయణమ్మ
భార్య : కందికుంట యశోదాదేవి
పుట్టిన తేదీ: 1-1-1967
చదువు: బీటెక్
అడ్రస్: డోర్ నం. 3/5, రామాలయం పక్కన, కోనేరు వీధి, కదిరి

మంత్రి గారి.. సొంత రూలు..!


పెనుకొండలో అనధికార చట్టాలు

పెనుకొండ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన ఎన్ గ్రాండ్ హోటల్‌కు ఆనుకుని ఓ మైనార్టీ నాయకుడికి చెందిన 1.5 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టారు. ఇదే పట్టణానికి చెందిన నలుగురు రియల్టర్లు భూమిని కొనుగోలు చేసేందుకు ముందుకొచ్చారు. కొంత నగదు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. మంత్రి కార్యాలయం నుంచి ఓ రియల్టర్‌కు ఫోన్ వచ్చింది. 'మా అనుమతులు లేకుండా భూమి ఎలా కొనుగోలు చేస్తారు, అతడు ఎలా అమ్ముతాడు? కార్యాలయానికి రండి, లేకుంటే రిజిస్ట్రేషన్ ఎలా జరుగుతుందో చూస్తాం' అని గద్దించినట్లు తెలిసింది. దీంతో రియల్టర్లు ఇదేం చట్టం అంటూ విస్తుపోతున్నారు. భూ యజమాని అమ్ముతుంటే మధ్యలో వీరి జోక్యం ఏంటని వాపోతున్నారు. ఇలా అయితే అవసరాలకు భూములు అమ్ముకోవడం అసాధ్యమని చర్చించుకుంటున్నారు.

ఆయన ఓ ఉద్యోగి. మరో ఐదేళ్లలో రిటైర్ అవుతారు. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఐదు సెంట్ల స్థలం కొనుగోలు చేశారు. నగర పంచాయతీలో నిర్మాణానికి అనుమతి కూడా తీసుకున్నారు. నాలుగు రోజుల క్రితం భూమిపూజ చేసి, బోరు వేసేందుకు సిద్ధమయ్యారు. అంతే మంత్రి బ్యాచ్ అక్కడ వాలిపోయింది. ఇంటి నిర్మాణానికి అడ్డుచెప్పారు. అధికారులకు చెప్పి పనులు నిలిపివేయించారు. బోరు వేయడానికి అనుమతులు ఇవ్వాలని అధికారులను అడగ్గా.. ప్రస్తుతం కుదరదని తెగేసి చెప్పడంతో ఆ ఉద్యోగి సొంతింటి కలపై నీళ్లు చల్లినట్లయింది.



ఇంటి నిర్మాణం ఆపేసిన స్థలం ఇదే



కొత్త చట్టాలు

మూడు నెలల నుంచి పెనుకొండ నియోజకవర్గంలో కొత్త చట్టాలు అమలవుతున్నాయి. మంత్రి అనుచరులు అన్నీ తామై వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎవరైనా మాట వినకపోతే అధికారుల ద్వారా అడ్డంకులు సృష్టిస్తున్నారని తెలుస్తోంది. పెనుకొండలో కనీవినీ ఎరుగని సొంత చట్టాలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాన్యులు పెనుకొండలో బతికి బట్ట కట్టినట్లేనని వాపోతున్నారు. మంత్రిని ప్రశ్నించే శక్తిలేక జనం మిన్నకుండిపోతున్నారు. ఎన్నాళ్లో ఈ పరిస్థితి అంటూ ఆవేదన చెందుతున్నారు. ఈ కొత్తచట్టాలను మరికొన్ని కార్యాలయాలు, వ్యాపారులపై అమలు చేసే దిశలో ఉన్నట్లు తెలుస్తోంది.

బృందాలుగా ఏర్పడి.. సమాచారం

మంత్రి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన కొందరు అధికార పార్టీలోని కీలక సామాజికవర్గానికి చెందిన నాయకులు పెనుకొండలో వాలిపోయారు. వారు బృందాలుగా ఏర్పడి, భూములు, స్థలాల క్రయవిక్రయాలు ఎక్కడ సాగుతున్నాయి, స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములకు ఎవరు అగ్రిమెంట్ వేశారన్న వివరాలు ఆరాతీసి, మంత్రికి సమాచారం చేరవేస్తున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. ఆ మేరకు రియల్టర్లకు ఫోన్‌లో బెదిరిస్తున్నట్లు పట్టణంలో చర్చించుకుంటున్నారు. మంత్రి తీరుతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

అన్నింటికీ మంత్రి అనుమతులు ఉండాల్సిందే..

తెలుగుదేశం హయాంలో కియ పరిశ్రమ రాకతో వేల మందికి ఉద్యోగావకాశాలు దక్కాయి. వందల ఎకరాల భూముల క్రయవిక్రయాలు సాగాయి. అప్పట్లో దేనికీ అధికార పార్టీ నాయకులు అడ్డు చెప్పలేదు. ప్రస్తుతం పెనుకొండ నియోజకవర్గంలో కొత్త చట్టాలు అమలవుతున్నాయి. భూములు కొనాలన్నా.. అమ్మాలన్నా.. మంత్రి అనధికార అనుమతులు ఉండాల్సిందే. లేకుంటే సాగవు. సామాన్యులకు సొంతిల్లు కట్టుకోవడం అనేది ఒక కల. అలాంటి ఇంటి నిర్మాణం కోసం ఓ ఉద్యోగి భూమిపూజ చేసి బోరువేస్తున్న సమయంలో మంత్రి ఆశీస్సులు తీసుకోకపోవడంతో అడ్డుకున్నారు. అధికారులకు ఫోన్‌చేసి అనుమతులు ఇవ్వకుండా చేస్తున్నారు. పెనుకొండ నియోజకవర్గ చరిత్రలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. కొత్త చట్టాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పెనుకొండ టౌన్

- భూమి, స్థల క్రయవిక్రయాలు, ఇంటి నిర్మాణానికి కూడా
- కొండపై వాలిన దుర్గం బ్యాచ్
- ప్రతీ సమాచారం చేరవేస్తున్న వైనం
- బెంబేలెత్తుతున్న రియల్టర్లు, జనం



ముఖం చాటేసిన రియల్టర్!

ఇటీవల మంత్రి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా 30 సెంట్ల స్థలం ఇంటి నిర్మాణానికి కొనుగోలు చేయాలనుకున్నారు. మంత్రికి భయపడి భూ యజమాని మార్కెట్ విలువ కంటే తక్కువ ధరకు ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. మార్కెట్ విలువ అక్కడ సెంటు రూ.8.5 లక్షలు పలుకుతుంటే అంతకన్నా తక్కువ ధరకు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. లేఔట్లు వేసిన రోడ్లతో పాటు మంత్రి ఇంటి నిర్మాణానికి వాస్తుదోశం ఉందనీ, ఉత్తరం రోడ్డు ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిసింది. అసలే తక్కువ ధరకే ఇస్తున్నాననీ, అదనంగా ఉత్తరం రోడ్డుకు స్థలం కేటాయిస్తే దాదాపు రూ.40లక్షలు నష్టపోతానంటూ ఆ రియల్టర్ తాడిపత్రికి మకాం మార్చేశాడు. అప్పటి నుంచి ఆ లేఔట్‌లో ఎవరు ఇంటి నిర్మాణం చేపట్టినా అడ్డుకోవడం పరిపాటిగా మారింది.





కొండల్ని మింగేస్తున్నారు..

మట్టి కోసం వైసీపీ వర్గీయుల బరితెగింపు
చోద్యం చూస్తున్న అధికారులు

పెనుకొండ టౌన్, మార్చి 29: సోమందేపల్లి మండలంలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. కొండల్ని సైతం మింగేస్తోంది. సోమందేపల్లి చెరువు సమీపాన ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వి, టిప్పర్లతో తరలిస్తున్నారు. రోజూ ధనార్జనే ధ్యేయంగా అధికార పార్టీ నాయకులు మట్టికోసం బరితెగిస్తున్నారు. అంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా మట్టిమాఫియా ఆగడాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మట్టి తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

వాహనాలు సీజ్ చేస్తాం

అనుమతులు లేకుండా మట్టి తవ్వినా.. తరలించినా వాహనాలు సీజ్ చేస్తాం. వీఆర్వోను పంపి టిప్పర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేస్తాం.

- అంజనాదేవి, తహసీల్దార్



కొండను తవ్వేసిన మట్టి మాఫియా

విధేయతకు పట్టం

అనంతపురం ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ
కలిసొచ్చిన సామాజిక సమీకరణాలు



హిందూపురం, మార్చి 29: పార్టీకి విధేయుడిగా పేరు తెచ్చుకున్న టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణకు అధిష్టానం అనంతపురం ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించింది. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌పై అభిమానంతో అంబికా పార్టీకి ఆకర్షితుడయ్యారు. 2009 ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ టిక్కెట్ కోసం ప్రయత్నించారు. పార్టీ అధిష్టానం అబ్దుల్‌ఘనీకి అవకాశం ఇచ్చింది. టీడీపీ టిక్కెట్ కోసం హైదరాబాద్ వెళ్లిన అంబికా కాంగ్రెస్ బీఫారం తీసుకొని రావడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఆ ఎన్నికల్లో పోటీ చేసి అంబికా ఓడిపోయారు. 2014 ఎన్నికల్లో నందమూరి బాలకృష్ణ హిందూపురం రావడంతో ఆయన పురం సీటు వదులుకున్నారు. 2019 ఎన్నికలకు కొన్ని రోజుల ముందు అహుడా చైర్మన్ పదవి వరించింది. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడ్డాక టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అంబికాకు బాధ్యతలు అప్పగించారు. ఈసారి ఎన్నికల్లో హిందూపురం ఎంపీ స్థానానికి పోటీ చేసేందుకు ఆసక్తి చూపారు. సామాజిక సమీకరణల్లో భాగంగా ఆయనకు అనంతపురం నుంచి అవకాశం కల్పించారు. అంబికా లక్ష్మీనారాయణ వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా కొనసాగుతున్నారు. అంబికా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎంపీ అభ్యర్థిగా ప్రకటించాక అంబికా మాట్లాడుతూ.. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ, నారా లోకేశ్ రుణం తీర్చుకోలేనిదన్నారు. వాల్మీకులకు టీడీపీ పెద్దపీట వేసిందన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు: కలెక్టర్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కదిరిఅర్బన్, మార్చి 29: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అరుణ్ బాబు.. యంత్రాంగాన్ని ఆదేశించారు. స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో శుక్రవారం కలెక్టర్ తాగునీరు, ఉపాధి పనులపై డివిజన్‌లోని అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటిని ఇతర అవసరాలైన వాహనాలు, ఇంటి తోటలకు వాడరాదన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నీటి వృథాను అరికట్టాలన్నారు. నీటి పథకాలన్నీ సక్రమంగా పనిచేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామస్థాయిలో చేతిపంపుల మరమ్మతులు నాలుగు గంటల లోపు చేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీలకు ఏప్రిల్ 1 నుంచి కొత్త వేతనం అమలు చేసేలా కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రోజు కూలీ ప్రస్తుతం రూ.300 అన్నారు. కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. అన్నిశాఖల సమన్వయంతో శనివారం నిర్వహించనున్న కదిరి లక్ష్మీనరసింహ రథోత్సవంలో భక్తులకు ఇబ్బందులు కలగకుడా ప్రత్యేక చర్యలు చేపట్టాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వంశీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ వెంకటనారాయణ, డ్వామా పీడీ విజయప్రసాద్, డివిజన్‌లోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, ఉపాధి అధికారులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతలు (శుక్ర)	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	40.0	26.0
కదిరి	38.0	25.0
ధర్మవరం	39.0	26.0
హిందూపురం	38.0	24.0
పెనుకొండ	38.0	25.0



ధర్మవరం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఖాళీ బిందెలతో రోడ్డెక్కిన మహిళలు



పంచాయతీ బోరుకు అమర్చిన స్ప్రింక్లర్ పైపులు

మైలేపల్లిలో దాహం.. దాహం..

కొత్తచెరువు, మార్చి 29: మండలంలోని మైలేపల్లిలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన పలువురు మహిళలు ధర్మవరం ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో పంచాయతీ బోరు మరమ్మతుకు గురై నెలరోజులు దాటుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీంతో తాగునీటి కోసం సమీపంలోని వ్యవసాయబావులను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోయారు. దాదాపు 300 జనాభా ఉన్న గ్రామంలో తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సత్యసాయి నీరు రెండు గంటలు మాత్రమే వస్తుందనీ, ఆ సమయంలో పనులు వదులుకుని పడిగాపులు కాయాల్సి వస్తోందని మహిళలు వాపోయారు. మైలేపల్లిలోని ఒక కాలనీకి దాదాపు 6 నెలల నుంచి నీరు సరఫరా కాలేదనీ, సర్పంచ్‌కు తెలిపినా పంచాయతీలో డబ్బు లేవనీ, ప్రజలే మరమ్మతులు చేయించుకోవాలని ఉచిత సలహా ఇచ్చారని కాలనీవాసులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని మహిళలు కోరారు.

వైసీపీ కార్యకర్తకు ధారాదత్తం

తిరుమలదేవరపల్లి సమీపంలోని చిత్రావతి నది సమీపాన అక్కమ్మగారి గుడివద్ద టీడీపీ హయాంలో రూ.5.80 లక్షలతో తాగునీటి బోరుతో పాటు పైపులైన్ ఏర్పాటు చేశారు. ఆ బోరు టీడీపీ హయాంలో వేయించినది కావున, వైసీపీ ప్రభుత్వంలో వాడకూడదనే నెపంతో ఆ బోరుకు ఉన్న విద్యుత్‌మోటారు, పైపులను అధికార పార్టీ మద్దతు సర్పంచ్ తొలగించాడు. దీంతో అధికార పార్టీకి చెందిన ఒక కార్యకర్త పంచాయతీ బోరుకు విద్యుత్ మోటారు అమర్చి తాను సాగుచేసిన వేరుశనగ పంటకు యథేచ్ఛగా నీటిని వాడుకుంటున్నాడని మహిళలు వాపోయారు. పంచాయతీ బోరును అధికార పార్టీ కార్యకర్తకు ఇవ్వడం ఏమిటని వారు ప్రశ్నించారు. విషయాన్ని అధికారులకు తెలియజేసిన వారు కూడా పట్టించుకోకపోవడం చూస్తుంటే అధికార పార్టీ నాయకులకు తలొగ్గారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈవిషయంపై పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌రెడ్డిని అడగ్గా.. మైలేపల్లిలో పంచాయతీ బోరు మరమ్మతులకు లోనైన విషయం వాస్తవమేనన్నారు. త్వరలోనే మరమ్మతులు చేసి, తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.35 శనివారం (సాయంత్రం)	4.57 ఆదివారం (ఉదయం)
కదిరి	6.31 శనివారం (సాయంత్రం)	5.01 ఆదివారం (ఉదయం)
ధర్మవరం	6.37 శనివారం (సాయంత్రం)	4.58 ఆదివారం (ఉదయం)
హిందూపురం	6.35 శనివారం (సాయంత్రం)	5.02 ఆదివారం (ఉదయం)
పెనుకొండ	6.33 శనివారం (సాయంత్రం)	4.59 ఆదివారం (ఉదయం)

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



పుట్టపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ధర్మవరం టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

- ఎన్టీఆర్‌కు ఘన నివాళులు

పుట్టపర్తి, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసమే ఎన్టీఆర్ ఈ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. ఈ పార్టీతోనే బడుగు బలహీన వర్గాలకు గుర్తింపు వచ్చిందన్నారు. ఎన్టీఆర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తామని, చంద్రబాబు అడుగు జాడల్లో నడుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, శ్రీరామిరెడ్డి, రామాంజనేయులు, బెస్త చలపతి, ఓబులేశు, శ్రీరాంనాయక్, బొమ్మయ్య, అంబులెన్స్ రమేశ్, చిన్నపెద్దన్న, ఉమాపతి, రామమనోహర్, రామప్ప తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం: తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. పార్టీ నియోజకవర్గ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య మాట్లాడుతూ ఎన్టీఆర్ తెలుగుదేశంపార్టీని స్థాపించి రాష్ట్ర ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చారన్నారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడిన ఏకైక వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, మద్దిలేటి, నాగూర్‌హుస్సేన్, గరుగువెంగప్ప, బొట్టుకిష్ట, రాంపురం శీన, పూలకుంట్ల మహేశ్, కేశగాళ్లశీన, కత్తులబాబ్జీ, కరెంట్‌ఆది, మాదన సుబ్బయ్య, కేతినేనిరాజ, అడ్డా మహేశ్, శంకర, తోట నారాయణస్వామి, ఉస్మాన్, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండల కేంద్రంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాలుగురోడ్ల కూడలిలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకుడు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మలమనోహర్, నాయకులు చికెన్‌తిరుపాల్, గడ్డం మోహన్, రియాజ్, రంగనాయకులు, రామాంజి, ఉత్తమనాయుడు, మల్లెల నారాయణస్వామి, వెంకటనారాయణ, లింగుట్ల నారాయణస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి. నివాళులర్పించారు. అంతకు ముందు కేక్ కట్ చేశారు. నాయకులు జెరిపిటి అంజనప్ప, మండోజీ ఆర్బీఖాన్, పొగాకు షబ్బీర్, నిజాం, పీట్ల సుధాకర్, తుమ్మల మహబూబ్‌బాషా, కంచి సురేష్, చికెన్ షాను, నవాబుకోట అంజనేయులు, బొడ్డు జయన్న, చవిటి కిష్ట, శివశంకర్‌రెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అక్కడ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండలకన్వీనర్ మైలేశివశంకర్, నాయకులు బుట్టి నాగభూషణనాయుడు, గడ్డం రమణారెడ్డి, సలాం ఖాన్, వెంకటరమణనాయుడు, మైలే రామచంద్ర, మంజునాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి, పుట్ల రవి, ప్రభాకర్, పాపారాయుడు, పద్మనాభరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొత్తచెరువులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద వేడుకలు



ముదిగుబ్బలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తూ..



నల్లమాడలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులు

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

పుట్టపర్తి రూరల్,/బుక్కపట్నం మార్చి 29: మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లి వద్ద ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొని యువకుడు దుర్మరణం చెందిన ఘటన గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పుట్టపర్తి రూరల్‌పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. బుక్కపట్నం మండలం నారసింహపల్లికి చెందిన కిష్టప్ప కుమారుడు విష్ణువర్ధన్‌నాయుడు (35) కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా గురువారం అర్ధరాత్రి పుట్టపర్తి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. కర్ణాటక నాగేపల్లి వద్దకు రాగానే బైక్‌ను రహదారి పనులు చేస్తున్న టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విష్ణువర్ధన్‌నాయుడు అక్కడిక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.



విష్ణువర్ధన్ నాయుడు (ఫైల్)

విష్ణువర్ధన్‌నాయుడి మృతి విషయం తెలుసుకున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మధ్యాహ్నం గ్రామానికి వచ్చి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న పల్లె

పెద్దపల్లి రోడ్డుకు మరమ్మతులు

- రూ.10 లక్షల సొంత డబ్బు వెచ్చింపు
- సొంతూరు రుణం తీర్చుకునేందుకే అంటున్న యువకుడు



రోడ్డు మరమ్మతులు చేయిస్తున్న ముక్తియార్

తనకల్లు, మార్చి 29: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆ గ్రామానికి చెందిన ఓ యువకుడు చలించిపోయాడు. తనవంతు సహకారంగా రహదారి సౌకర్యం కల్పించాలని భావించారు. అనుకున్నదే తడువుగా పనులను ఆచరణలో పెట్టారు. గ్రామానికి చెందిన ముక్తియార్‌బాషా కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో స్థిరపడ్డారు. ఇటీవల ఆయన స్వగ్రామానికి వచ్చారు. అటు కర్ణాటక రాష్ట్రంలోని చాకివేలునుంచి కానీ.. ఇటు అన్నమయ్య జిల్లాలోని పెద్ద తిప్పసముద్రం మండలం కందుకూరునుంచి కానీ గ్రామానికి రావడానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. ఈ విషయాలను గ్రామస్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన రూ.పదిలక్షల వ్యయంతో రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభించారు. కొత్తకురవపల్లి గ్రామ సరిహద్దు నుంచి కందుకూరు వరకు, పెద్దపల్లి వద్ద నుంచి కర్ణాటక రాష్ట్రంలోని చాకివేలు వరకు రోడ్ల మరమ్మతు పనులు చేపట్టారు. ముక్తియార్ బాషా శుక్రవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ తాను జన్మించిన గ్రామానికి రహదారి లేకపోవడంతో, స్వచ్ఛందంగా రోడ్ల మరమ్మతులు చేపట్టానని అన్నారు.

అనంతలో యువతి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మార్చి 29: నగరంలోని సాయినగర్‌లో నివాసముంటున్న శ్రీజ(22) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. ఓ ఇంజెక్షన్ తీసుకొని మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం మద్దనహళ్లికి చెందిన శ్రీజ నగరంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. సాయినగర్ మూడో క్రాస్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో తన సోదరితో కలిసి ఉంటోంది. శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన తరువాత ఇంజెక్షన్ తీసుకున్నట్లు సమాచారం. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీజను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

కూటమి గెలిస్తే.. బీసీలకు ప్రత్యేక చట్టం

- మాజీమంత్రి పల్లె రఘునాథ రెడ్డి

బుక్కపట్నం, మార్చి 29: టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని తేరు కూడలిలో శుక్రవారం ఆయన జయహో బీసీ పేరిట బీసీలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 50యేళ్ల వయసు కలిగిన బీసీలకు ప్రతినెలా రూ. 4 వేలు పింఛన్ ఇస్తామని, ఆడ బిడ్డ నిధి కింది ప్రతి మహిళకు యేటా రూ.18వేలు వారి ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ఎంతో మంది బీసీలపై అక్రమ కేసులు బనాయించి వేధించారని, దీంతో చాలామంది ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. అరాచక జగన్ పాలనకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో సైతం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన అనుచరులు చేసిన వేధింపులు తాళలేక చాలామంది ఇతర ప్రాంతాలకు తరలిపోయారని ఆవేదన చెందారు. అవినీతి ఎమ్మెల్యేకి బుద్ధి చెప్పాలంటే పల్లె సింధూరారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు సుబ్బారెడ్డి, జంగం వెంకటరాముడు, గంగాధర్, సయ్యద్‌బాషా, లింగప్పగారిపల్లి రవి, తెలుగుయువత అంబులెన్స్ రమేష్, మురళి, సుధీర్, సతీష్‌రాయల్, రెడ్డికేసి, మంజు, మోహన్, జనార్థన్, లావణ్యగౌడ్, యశోద తదితరులు పాల్గొన్నారు.



బీసీ నాయకులతో మాజీ మంత్రి పల్లె

టీడీపీలోకి 25 కుటుంబాల చేరిక

పుట్టపర్తి/ఓబుళదేవరచెరువు: మండలంలోని వణుకువారిపల్లికి చెందిన 25 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పుట్టపర్తి పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం వారు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమక్షంలో చేరారు. వారికి పల్లె కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. చేరినవారిలో చిన్నప్ప, మధు, నాగలక్ష్మి, స్వర్ణమ్మ, సురేష్, అరుణమ్మ, రమణప్ప, వెంకటలక్ష్మి, సుధాకర్, వెంకటప్ప, శివమ్మ, రామచంద్ర, రమణమ్మ, మహేష్, శైలజ, వెంకటరమణ, అంజనప్ప, రెడ్డెమ్మ, లక్ష్మినారాయణ, హరికుమార్, రామక్క, వెంకటస్వామి, అక్కులప్ప, రంగమ్మలు తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో మాజీ మంత్రి పల్లె

కేబుల్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

నల్లచెరువు, మార్చి 29: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న 15 బోరుబావులకు సంబంధించిన కేబుల్‌ను గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతులు మాట్లాడుతూ.. బోరు బావుల వద్ద మొక్కజొన్న, వరి, పూల తోటలు సాగు చేశామన్నారు. కాగా గురువారం రాత్రి కేబుల్ వైర్లు చోరీ అయ్యాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, దీనికి తోడు ఇప్పుడు వైర్లు చోరీ అయ్యాయని బాధపడ్డారు. కేబుల్ చోరీకి పాల్పడిన వారిని పట్టుకుని.. తమకు న్యాయం చేయాలని రైతులు బాస్కర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి హనుమంతురెడ్డి, వెంకటరమణారెడ్డి, విజయశేఖర్, రాజు తదితరులు కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ప్రజలకు డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పిలుపు
- పట్టణ వీధుల్లో కేంద్రబలగాలతో కవాతు

కదిరి, మార్చి 29: ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని, సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని అనంతపురం రేంజ్ డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం రాత్రి వారు స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పలు ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయని, ప్రజలకు భద్రత, భరోసా కల్పించడానికి, ఎటువంటి అల్లర్లు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల్లో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. జిల్లాపోలీసుల సహకారం ఉంటుందన్నారు. విలువైన ఓటు హక్కును ప్రతిఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాస్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగభూషణం, డీఎస్పీ శ్రీలత, సైబర్ క్రైమ్ సీఐ హేమంత్‌కుమార్, సీఐలు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మోహన్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో కవాతు చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

రథోత్సవానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయండి

కదిరి: పట్టణంలో శనివారం జరిగే శ్రీవారి బ్రహ్మరథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయాలని అనంతపురం రేంజి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. వారు స్థానిక లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం పోలీసు అధికారులతో మాట్లాడుతూ.. రథోత్సవంలో ఎటువంటి సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. విధుల్లో ఉన్నవారు భక్తిభావంతో ఉండాలన్నారు. తొక్కిసలాట జరగకుండా చూడాలన్నారు. జేబుదొంగలను పసిగట్టాలన్నారు. నిర్దేశిత పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలను నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పలు కుటుంబాలకు పల్లె పరామర్శ

నల్లమాడ, మార్చి 29: మండలంలోని ఎన్.బండవాండ్లపల్లికి చెందిన వెంకటలక్ష్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం గ్రామానికెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బొగ్గల పల్లిలో గంగులప్ప కుమారుడు, రాజు అనారోగ్యంతో బాధపడుతుండగా.. అతన్ని పరామర్శించారు. ఆయన వెంట సలాంఖాన్, బుట్టి నాగభూషణనాయుడు, అశోక్‌ఖాన్, హరి ఉన్నారు.

విద్యార్థి మృతికి నివాళి

కొత్తచెరువు: మండలంలోని నారేపల్లి పంచాయతీ కదిరెప్పపల్లికి చెందిన కొండన్న కుమారుడు సురేంద్ర(21) అనంతపురంలో శుక్రవారం ఉదయం రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సాయంత్రానికి కదిరెప్పపల్లికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి గ్రామానికి వెళ్లి సురేంద్ర మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పల్లె వెంట నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, చంద్రాయుడు, హర్షాచౌదరి ఉన్నారు.

చంద్రబాబును కలిసిన టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 29: ప్రజాగళం కార్యక్రమంలో భాగంగా కదిరికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినట్లు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. చంద్రబాబు కదిరిలో బస చేసిన ప్రాంతానికి వెళ్లి కలిశానన్నారు. ఆయన ఎంతో ఆప్యాయంగా పలకరించారని చెప్పారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు, దివాకర్ రెడ్డి, నాయకులు శివప్రసాద్‌నాయుడు, కిరణ్‌నాయుడు, మల్లికార్జున, అంజనేయులు, రమణ తదితరులు కూడా కలిసినట్లు పేర్కొన్నారు.



చంద్రబాబును కలిసిన రామాంజనేయులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

నల్లచెరువు, మార్చి 29: మండలంలోని ఉబ్బిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం పుస్తకాలు పంపిణీ చేశారు. అరుణోదయ యూత్ అసోసియేషన్ చైర్మన్ తవళంమర్రి నాగమల్లు ఆధ్వర్యంలో ఈపంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా డీఎల్‌పీఓ అంజనప్ప హాజరై పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, గైడ్లు పంపిణీ చేయడం హర్షించతగ్గవిషయమన్నారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న డీఎల్‌పీఓ

కేజీబీవీ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరంరూరల్, మార్చి29: మండలంలోని మోటుమర్ల కేజీబీవీలో 6వతరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్ఓ చంద్రకళ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6వ తరగతికి 40సీట్లు, ఇంటర్ ప్రవేశాలకు సీఈసీ గ్రూపులో 40సీట్లు ఉన్నాయన్నారు. 7, 8, 9 తరగతులకు మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. విద్యార్థినులు అన్ని సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్ర్కూట్నీ ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన విద్యార్థినులకు ఫోన్‌ద్వారా సమాచారం ఇస్తామని చెప్పారు. ఏప్రిల్ 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి: జేసీ

ముదిగుబ్బ, మార్చి29: వేసవిలో తాగునీటి సమస్యను తలెత్తకుండా చూడాలని, ఎక్కడైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం స్థానిక అధికారులతో సమావేశమై మాట్లాడారు. వేసవికాలం తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా సమస్య రానీయకూడదని చెప్పారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని సంబంధితాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ప్రసాద్, విద్యుత్ ఏడీ బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే



కర్ణాటకనాగేపల్లి కింగ్స్ చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

పుట్టపర్తి రూరల్, మార్చి 29: మున్సిపాలిటీ పరిధిలోని కర్ణాటకనాగేపల్లిలో శుక్రవారం గుడ్‌ఫ్రైడేను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యేసు లోకాన్ని వీడిన రోజును గుడ్‌ఫ్రైడేగా వారు భావిస్తారు. ఈ సందర్భంగా స్థానిక కింగ్స్ చర్చిలో ప్రత్యేకప్రార్థనలు చేశారు. నలభైరోజులుగా ఉపావాసాలున్న క్రైస్తవులు ప్రార్థనలు నిర్వహించి ఉపావా సాలు వీడారు. లోకంలో పాపసంహారానికే యేసుప్రభువు మరణబాధను అనుభవించారని పాస్టర్లు సందేశంలో పేర్కొన్నారు. మండలంలో వెంగళమ్మ చెరువు, పెడపల్లి, కొట్లపల్లి, నిడిమామిడి చర్చిల్లో సైతం గుడ్‌ఫ్రైడే వేడుకలు జరిగాయి.

ధర్మవరంరూరల్: పట్టణంలోని ఎర్రగుంటలోని చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ మల్లెల రమేష్‌బాబు సందేశం ఇస్తూ.. బైబిల్‌లోని అతిముఖ్యమైన సంఘటనలు తెలియజేశారు. లోక రక్షకుడు, శాంతిస్వరూపుడు యేసుప్రభుని తెలియజేశారు. క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఓబుళదేవరచెరువు: క్రీస్తు శిలువ వేయబడిన రోజును స్మరించుకుంటూ మండల కేంద్రంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో గుడ్‌ఫ్రైడేని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఏసు క్రీస్తు శిలువలో చివరిగా పలికిన మాటలను స్మరించుకున్నారు. క్రైస్తవులు ఉదయంనుంచి సాయంత్రం వరకు ఉపసావాసముండి ప్రత్యేక ప్రార్థన చేశారు. శిలువ త్యాగాన్ని స్మరిస్తూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. పాస్టర్ రెవరెండ్ డాక్టర్ ఎంజీ జయానందం మాట్లాడుతూ... నాడు లోకరక్షణకోసం యేసుక్రీస్తు శిలువ వేయబడ్డారన్నారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి దార్ల రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

రేపు ఈస్టర్ వేడుకలు

ఏసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన దినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఈస్టర్ వేడుకలను నిర్వహించనున్నట్లు పాస్టర్ జయానందం పేర్కొన్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు

లేపాక్షి, మార్చి 29: అతి పురాతన చౌడేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.



అలంకరణలో అమ్మవారు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చిత్రపటంపై పూలు వేసి, నివాళులు అర్పిస్తున్న పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు




కేక్ కట్ చేస్తున్న చంద్రబాబునాయుడు

కదిరి, మార్చి 29: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కదిరిలో చంద్రబాబునాయుడు గురువారం ప్రజాగళం యాత్ర నిర్వహించారు. కదిరి పట్టణంలోని పీవీఆర్ గ్రాండ్‌లో రాత్రికి బస చేశారు. శుక్రవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీవీఆర్ గ్రాండ్ ఆవరణలో టీడీపీ జెండాను చంద్రబాబు ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు. తరువాత కేక్ కట్ చేసి, మున్సిపాలిటీలోని 17వ వార్డు కౌన్సిలర్ స్వావిత్రమ్మకు, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడుకు తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ కదిరి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఖాద్రీశుడి బ్రహ్మ రథోత్సవం

- అన్ని దారులు కదిరివైపే..
- తరలిరానున్న భక్తజనం
- అదనపు పోలీసు బలగాలతో భద్రతా ఏర్పాట్లు
- భక్తుల కోసం ప్రత్యేక అన్నదాన కేంద్రాలు



రథానికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కదిరి, మార్చి 29: ఖాద్రీశుడి రథోత్సవానికి సర్వం సిద్ధమయ్యింది. దేశంలోనే ప్రాముఖ్యత కలిగిన ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి రథాన్ని సుందరంగా అలంకరించారు. అధికారులు, పోలీసు సిబ్బంది రథోత్సవానికి ముమ్మర ఏర్పాట్లు చేశారు. రథం లాగడానికి మొద్దులు, మోకులు, తెడ్లు ఇప్పటికే సిద్ధం చేశారు. భక్తుల రాకకోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ అదనపు బలగాలను సిద్ధం చేసింది. ఇప్పటికే పలు వాహనాలతో కదిరి పట్టణం నిండిపోయింది. లక్ష్మీనరసింహస్వామి అలయం భక్తులతో కిటకిలాడుతోంది. ఉదయం 7.20గంటలనుంచి 8.10 నిమిషాల లోపు అనురాధ నక్షత్రలోని శుభ మేష లగ్నం పుష్కర్మాశంలో రథాన్ని కదిలించాలని పండితులు ముహూర్తం ఖరారు చేశారు. అన్నిశాఖల సమన్వయంతో ఆలయ అధికారులు రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అన్నదాన ఏర్పాట్లు విస్తృతంగా చేపట్టారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఖాద్రీశుడి రథోత్సవానికి భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు కదిరి ఆర్టీసీ డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు డిపోలో ఉన్న 110 బస్సులకు అదనంగా మరో 15 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కదిరినుంచి గోరంట్ల మీదుగా హిందూపురానికి 20, నల్లమాడకు 10, మదనపల్లికి 20, బెంగుళూరుకు 15, పులివెందుల 7, తలుపుల 6 బస్సులు ఏర్పాటుచేశామన్నారు. పట్టణంలోని జీవిమానుసర్కిల్, వేమారెడ్డి సర్కిల్, హిందూపురం రోడ్డులోని సరస్వతి విద్యామందిరం వద్ద ప్రయాణీకుల సౌకర్యంగా షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



మొద్దులు, మోకులు సిద్ధం

లక్ష్మీనరసింహస్వామి రథం భక్తుల శక్తి మీదే ముందుకు కదులుతోంది. ఎటువంటి యంత్రాలు ఇం దులో ఉపయోగించరు. రథం లాగడానికి మోకులు (తాళ్లు) రథం ముందుకు కదలడానికి వెనుకవైపున వేసే మొద్దులు, రథం సరైన దారిలో నడవడానికి తెడ్లు సిద్ధం చేశారు. ముందు భాగాన భక్తులు మోకులు లాగుతుంటే వెనకబాగాన మొద్దులు వేయడంలో ఆరితేరిన కుటాగుళ్ల, గజ్జలరెడ్డిపల్లి, మూర్తిపల్లి, గంగిరెడ్డిపల్లి గ్రామస్థులు కీలకపాత్ర పోషిస్తారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తుల గోవింద నామస్మరణ, అర్చకుల వేదమంత్రోచ్చారణలతో రథం ముందుకు కదులుతుంది. తిరువీధులు వెడల్పు 20అడుగకలంటే మించకుండా ఎక్కడ ఇబ్బంది లేకుండా స్వామివారు రథాన్ని ముందుకు నడిపించి, భక్తులకు దర్శనమిస్తూ, యథాస్థానానికి చేరుకుంటారు. అదే ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ప్రత్యేకత, స్వామిని దర్శించుకోవడానికి లక్షలామంది భక్తులు హాజరవుతున్నారు.



స్వామివారికి ప్రీతిపాత్రమైన దవణం

బాలకృష్ణకు కృతజ్ఞతలు



బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతున్న అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం అర్బన్, మార్చి 29: టీడీపీ అనంతపురం ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం బాలకృష్ణను కలిశారు. తనకు ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించేలా సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.



రథోత్సవానికి సిద్ధం చేస్తున్న తెడ్లు

జనమే.. జనం

కదిరికి వచ్చే దారులన్నీ ఇప్పటికే వాహనాలతో నిండిపోయా యి. పట్టణంలో ఎక్కడ చూసినా భక్త జన సందోహంతో కిటకిటలాడుతోంది. వేలాదిమంది ఉన్న భక్తుల సంఖ్య శనివారానికి లక్ష కు పైగా చేరుతుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకమైన భజనలు, కోలాటలు, బుర్రకథలు, నాటకాలతో పట్టణంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.

రథోత్సవానికి తరలిరండి..

: శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈఓ

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యం కలిగిన బ్రహ్మరథోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశాం. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తుతోపాటు ఇతర ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులు భక్తి, శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకుని పునీతులు కావాలని కోరుకుంటున్నాం. ఎటువంటి తోపులాటకు అవసరం లేకుండా క్యూ లైన్లలో స్వామిని దర్శించుకోవాలి. సిబ్బందికి, అధికారులకు సహకరించాలి.

విశ్వం పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ అవగాహనా సదస్సుకు

విశేష స్పందన

తిరుపతి(విద్య), మార్చి 29: తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఎ.పి.ఆర్.జె.సి నమూనా ప్రవేశ పరీక్షకు, అవగాహనా సదస్సుకు విశేష స్పందన లభించిందని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థినీ విద్యార్థులు హాజరై నమూనా పరీక్షలు రాశారని చెప్పారు. 2023 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థిని చరితశ్రీ 120కి గాను 119 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించిందని వెల్లడించారు. అలాగే ఏపీఆర్జేసీ ఫలితాల్లో తనూజ, భువనేశ్వర్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాకులను సాధించారని వివరించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్స్ కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయోమెడికల్ తదితర కోర్సులు ఉంటాయని, మెరుగైన ర్యాంకు సాధించడం ద్వారా మంచి కళాశాలలో సీట్లతోపాటు ఉపాధి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని వివరించారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27 ఉంటుందని, ఏప్రిల్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన ఉంటుందని, మార్చి 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 8688888802, 939997 6999లలో సంప్రదించాలని కోరారు.

యువ ఓటర్లే కీలకం



అనంతలో కొత్త ఓటర్లు 43,155 మంది

- 18నుంచి 49ఏళ్ల వయసు ఓటర్లు 13,71,985
- 80ఏళ్ల పైబడిన ఓటర్లు 25,175
- వందేళ్ల పైబడిన ఓటర్లు 12 మంది

అనంతపురం టౌన్, మార్చి 29: జిల్లాలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యువ ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లా యంత్రాంగం ప్రకటించిన ఓటర్ల జాబితా ప్రకారం ప్రస్తుతం జిల్లాలో 20,01,200మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో వయసుల వారీగా చూస్తే యువ ఓటర్లే అధికంగా ఉన్నారు. 18నుంచి 19ఏళ్ల అంటే కొత్తగా ఓటుహక్కు నమోదు చేసుకున్న వారు అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 43,155 మంది ఉన్నారు. 18నుంచి 49ఏళ్ల వయస్సు వరకు ఉన్న ఓటర్లు జిల్లా వ్యాప్తంగా 13,71,985 మంది ఉన్నారు. ఇక 50నుంచి ఆపైన వరకు ఉన్న ఓటర్లు 6,29,215మంది ఉన్నారు. ఇందులో కూడా 80ఏళ్ల పైబడిన ఓటర్లు కేవలం 25,175మంది మాత్రమే ఉన్నారు. ఈలెక్కన పరిశీలిస్తే రాబోయే ఎన్నికలలో యువ ఓటర్లే ప్రధాన పాత్ర పోషించనున్నారని తెలుస్తోంది.

● వందేళ్ల పైబడిన ఓటర్లు 12 మంది..



జిల్లా వ్యాప్తంగా వందేళ్ల పైబడిన ఓటర్లు కొత్త జాబితా మేరకు కేవలం 12 మంది ఉన్నారు. కొత్త ఓటర్ల జాబితా నమోదు చేపట్టినప్పటినుంచి ఓటర్ల జాబితాను జిల్లా యంత్రాంగం రూపొందిస్తూ వస్తోంది. అందులో వయసుల వారీగా ఓటర్లను గుర్తించారు. తొలుత మొత్తం ఎనిమిది నియోజకవర్గాలలో కలిపి 20మంది ఉన్నట్లు చూపారు. వీటిని పరిశీలించగా ఒకరి వయసు తప్పుగా ఉన్నట్లు తేల్చి రాయదుర్గం నియోజకవర్గంలో ముగ్గురు, గుంతకల్ నియోజకవర్గంలో ఐదుమంది, తాడిపత్రిలో నలుగురు, రాప్తాడు నియోజకవర్గంలో ఆరుగురు, అనంతపురంఅర్బన్, కల్యాణదుర్గంలలో ఒక్కొక్కరు వందేళ్ల పైబడిన వారు ఉన్నట్లు గుర్తించి రికార్డులలో నమోదు చేసారు. కానీ ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో ఇందులో ఏడుగురు చనిపోయారని ప్రస్తుతం కేవలం 12మంది మాత్రమే వందేళ్ల పైబడిన ఓటర్లు ఉన్నట్లు చూపారు. ఇందులో రాయదుర్గంలో ఇద్దరు, గుంతకల్లులో ముగ్గురు, తాడిపత్రిలో ఇద్దరు, అనంతపురం అర్బన్‌లో ఒకరు, రాప్తాడు నియోజకవర్గంలో నలుగురు వందేళ్ల పైబడిన ఓటర్లు రాబోయే ఎన్నికలలో ఓటు వేయనున్నారు. వీరికి తొలిసారి ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించడం విశేషం

● జిల్లాలో వయసు వారీగా ఓటర్లు ఇలా...

వయస్సు	ఓటర్లు
18-19	43,155
20-29	3,65,300
30-39	5,82,480
40-49	4,24,205
50-59	2,94,301
60-69	1,77,754
70-79	88,830
80ఏళ్ల పైబడి	25,155



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

గజవాహనంపై దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహుడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీనరసింహుడు శుక్రవారం గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం అనంతరం గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సంధ్యాసమయంలో శ్రీవారు గజవాహనంపై ఊరేగారు. శ్రీమహావిష్ణు దశావతారాల్లో ఒక్కటైన నరసింహుడికి దేవేంద్రుడు తన వాహనమైన ఐరావతాన్ని పంపుతారని భక్తుల నమ్మకం. తెల్లవారితే బ్రహ్మరథోత్సవం ఉండటంతో ఆలయ ప్రాంగణంతో పాటు తిరువీధులు భక్తులతో కిక్కిరిసి పోయాయి. **- కదిరి**

పథకాలు బంద్..!

- పరిశ్రమల శాఖకు ఎన్నికల కోడ్ ఎఫెక్ట్
- విశ్వకర్మ, ఇతర పథకాల నిలిపివేత
- నిరాశలో లబ్ధిదారులు

అనంతపురం అర్బన్, మార్చి 29: సార్వత్రిక ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ పరిశ్రమల శాఖ పథకాలపై ప్రభావం చూపింది. గతంలో ముందు నుంచి కొనసాగుతున్న పథకాలకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి నుంచి మినహాయింపు ఇస్తూ వచ్చారు. ఈ సారి అలాంటి ఆన్‌గోయింగ్ పథకాలను నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంతోపాటు ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని నిలిపివేశారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలయ్యే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ పాలసీ, జగనన్న బడుగు వికాస పథకాలకు లబ్దిదారులు దరఖాస్తు చేసుకున్న ఒక్క పరిశ్రమ మంజూరు చేయలేదు. ఇంతలోగా ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆ పథకాలు బంద్ అయ్యాయి.

ఎక్కడి దరఖాస్తులు అక్కడే...

కేంద్ర విశ్వకర్మ పోర్టల్ నుంచి ఇప్పటి దాకా 54,794 మంది దరఖాస్తులను గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు పంపారు. ఇందులో జిల్లా స్థాయికి 5,682 దరఖాస్తులు సిఫార్సు చేశారు. ఇందులో 2,732 దరఖాస్తులు రాష్ట్ర స్థాయి అధికారులకు సిపార్సు చేశారు. అలాగే గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో 151, జిల్లా స్థాయిలో 343 దరఖాస్తులను సిఫార్సు చేయలేదు. అదే విధంగా గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీ స్థాయిలో 40,472 మంది దరఖాస్తులు, జిల్లాస్థాయిలో 48,769 దరఖాస్తులు, రాష్ట్రస్థాయిలో 2,949 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆన్‌గోయింగ్ స్కీంలకు ఎన్నికల కోడ్ నుంచి ఈసారి మినహాయింపు ఇవ్వకపోవడంతో విశ్వకర్మ పథకం దరఖాస్తులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఎన్నికల తర్వాత ఆయా దరఖాస్తులను రాష్ట్ర స్థాయికి పంపించి, అర్హులైన లబ్దిదారులకు శిక్షణ ఇచ్చి, బ్యాంక్ రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని పరిశ్రమల శాఖ జీఎం నాగరాజారావు పేర్కొన్నారు.



జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయం (ఫైల్)

బేఖాతర్..!

- వేటు వేస్తున్నా మారని వలంటీర్ల తీరు
- యథేచ్ఛగా వైసీపీకి ప్రచారం..

నల్లచెరువు, మార్చి 29: వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని సాక్షాత్తు కలెక్టర్ హెచ్చరిస్తున్నా.. తొలగింపు వేటు వేస్తున్నా వారిలో మార్పు రావడం లేదు. వైసీపీ నేతల ప్రచారంలో జోరుగా పాల్గొంటూ నిబంధనలు బేఖాతర్ చేస్తున్నారు. నల్ల చెరువు మండలంలో 18మంది వలంటీర్లను తొలగించినట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తొలగించినట్లు తెలిపారు.

ప్రచారంలో పాల్గొన్న వలంటీర్‌కు నోటీసు

గోరంట్ల : మండలంలోని బూదిలిపల్లి పంచాయతీ గంగాదేవిపల్లిలో జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్ బోయ రమేష్‌కు ఎంపీడీఓ, ఎంసీసీ అధికారి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం నోటీసు జారీ చేశారు. వలంటీర్ రమేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విషయాన్ని 'ఎన్నికల ప్రచారంలో వలంటీర్' అనేవార్తను ఆంధ్రజ్యోతి శుక్రవారం ప్రచురించింది. స్పందించిన ఎంపీడీఓ పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌నాయక్ ద్వారా వలంటీర్‌కు నోటీసు జారీ చేసి, సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. అలాగే కార్యదర్శిని జరిగిన సంఘటనపై విచారణ జరిపి, వెంటనే నివేదిక ఇవ్వాలని సూచించారు. పరిశీలిన నివేదిక అందిక అందిన వెంటనే ఉన్నతాధికారులకు తెలిపి, వారి ఆదేశం మేరకు వలంటీర్‌పై చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ వెల్లడించారు. అలాగే సిరగంవాండ్లపల్లిలో ఇళ్లు, పశువుల పాకలకు వైసీపీజెండాలు ఉండడంతో కోడ్‌ను పట్టించుకోరా అంటూ కథనం రావడంతో అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బంది పార్టీ జెండాలు తొలగించారు.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

విడపనకల్లు: వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి తనయుడు ప్రణయ్‌రెడ్డి శుక్రవారం హావళిగిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లు కొల్లారప్ప, జయన్న, సోమదాసు పాల్గొన్నారు. మాస్కులు ధరించి గుర్తు పట్టకుండా ప్రచారం నిర్వహించడం కొసమెరుపు. ప్రణయ్‌రెడ్డితో పాటు ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున కూడా పాల్గొనడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు జయన్న, సోమదాసు(మాస్కుల్లో..)

పింఛన్ రూ.4వేలు అందిస్తాం: సవిత


మోపర్లపల్లిలో ఓటును అభ్యర్థిస్తున్న సవిత, బీకే

రొద్దం, మార్చి 29: మరో రెండు నెలల్లో వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్ రూ.4వేలు అందిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అన్నారు. శుక్రవారం రొద్దం మండల తాడంగిపల్లి, మోపర్లపల్లి, ఎం.కొత్తపల్లి, గౌరాజుపల్లి గ్రామాల్లో సవిత, బీకే పార్థసారథి ప్రచారంలో పాల్గొన్నారు. అన్నదాతలకు రైతు భరోసా కింద రూ.20వేలు అందిస్తామన్నారు. నిరుద్యోగ భృతి ప్రతినెలా రూ.3వేలు అందిస్తామన్నారు. ప్రతి గ్రామంలోనూ టీడీపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే కనబడుతున్నాయన్నారు. మోపర్లపల్లి గ్రామంలో ఆంజనేయ గుడి నిర్మాణం కోసం రూ.5లక్షలు నిధులను మంజూరు చేస్తామన్నారు. బీకే మాట్లాడుతూ అవినీతి అరాచక పాలన చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, చిన్నప్పయ్య, నరసింహులు, టైలర్ ఆంజనేయులు, నరహరి, హరీష్, పవన్, శ్రీనాథ్‌చౌదరి, వైస్ ఎంపీపీ నరసింహులు, మోపర్లపల్లి సర్పంచ్ లక్ష్మీ, ఎం.కొత్తపల్లి సర్పంచ్ నాగరాజు, గౌరాజుపల్లి నారాయణ, రాజప్ప పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి


ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

లేపాక్షి, మార్చి 29: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ జయప్ప అన్నారు. శుక్రవారం బిసలమానేపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, రామాంజినమ్మ, ఈడిగ సాధికార కమిటీ డైరెక్టర్ చంద్రశేఖర్, షెక్షావలి, రమేష్, తిప్పారెడ్డి, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలతో మహిళాభివృద్ధి


ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 29: తెలుగుదేశం పార్టీ తీసుకొచ్చిన సూపర్‌సిక్స్ పథకాలతో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని ఆ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 8వ వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పథకాలు వెంటనే అమలు అవుతాయన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ మూడో సారి హ్యాట్రిక్ సాధిస్తే నియోజకవర్గాన్ని ఎక్కడాలేని విధంగా అభివృద్ధి చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ప్రస్తుత పరిస్థితులను గమనించి అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. నాగరాజు, తిమ్మయ్య, మంగేష్, ప్రెస్ వెంకటేశ్, కదిరప్ప, మురళి, మహేష్, నవీన్, టైలర్ గంగాధర్, నాయుడు, పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ


టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న పరిటాల సునీత

పెనుకొండ రూరల్, మార్చి 29: దివంగత నేత పరిటాల రవీంద్ర సన్నిహితుడు, టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారాయణస్వామి సతీమణి నాగలక్ష్మి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత ఆయన స్వగ్రామం నాగలూరుకు చేరుకొని నారాయణస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం నింపారు. ఆమె వెంట ఎల్. నారాయణచౌదరి ఉన్నారు.

చౌడేశ్వరీదేవికి పూజలు


అలంకరణలో అమ్మవారు

లేపాక్షి, మార్చి 29: అతి పురాతన చౌడేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. కార్యక్రమానికి భక్తులు చుట్టుపక్కల ప్రాంతాల నుంచేకాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో విచ్చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు.

న్యాయవాదులను సస్పెండ్ చేయండి

పెనుకొండ, మార్చి 29: బార్ కౌన్సిల్ నిబంధనలను అతిక్రమించి తమకు తాముగా న్యాయవాదుల సంఘం నూతన కమిటీని ప్రకటించిన ఆరుగురు న్యాయవాదులను సస్పెండ్ చేయాలని రాష్ట్ర కౌన్సిల్‌ను కోరినట్లు సంఘం అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సంఘం కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిల్ నిబంధన అనుసరించి 14వ తేదీన పెనుకొండ బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు స్వీకరించి నూతన కమిటీని ఎన్నుకున్నామన్నారు. ఈ కమిటీ రాష్ట్ర కౌన్సిల్ ఆమోదం పొందిందన్నారు. అయితే 28వ తేదీన కొందరు న్యాయవాదులు కౌన్సిల్ నిబంధనలు ఉల్లంఘించి తమకు తాముగా నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఈ కమిటీ చట్టపరంగా చెల్లదన్నారు. న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగరాజు ఈ ఎన్నికలు జరుపరాదంటూ వ్యతిరేకించి దూరంగా ఉన్నారని, అలాంటి వ్యక్తే ఎన్నికల అధికారిగా నూతన కమిటీ ఎన్నిక ఎలా జరిపారని ప్రశ్నించారు.

నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దు

హిందూపురం అర్బన్, మార్చి 29: పథకాలు అందిస్తామని ప్రజలను వంచించి మాయమాటలు చెప్పే నాయకులను నమ్మవద్దని బహుజన సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు సూచించారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఆబాద్‌పేటలో బీఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు బీఎస్పీ తరఫున అభ్యర్థులు బరిలో ఉంటారన్నారు. జిల్లా కోశాధికారి హర్షకుమార్, కదిరి ఇర్ఫాన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సుబ్బరాయప్ప, హిందూపురం పట్టణ అధ్యక్షుడు దాసరి ఈశ్వరయ్య, నారాయణ, సడ్లపల్లి నారాయణప్ప, చంద్రశేఖర్, మౌలాలి ఉన్నారు.

ఎంపీ అభ్యర్థి చంద్రప్పకు యాదవానందస్వామి ఆశీస్సులు


చంద్రప్పను ఆశీర్వదిస్తున్న స్వామీజీ

పావగడ, మార్చి 29: కాంగ్రెస్ చిత్రదుర్గం పార్లమెంటు అభ్యర్థి చంద్రప్పకు యాదవ మఠాధీశ్వరుడు యాదవానంద స్వామి తన ఆశ్రమంలో ఆశీర్వదించి అభినందించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించడంతోపాటు బిఫాం కూడా అందజేయడంతో యాదవమఠానికి తరలి వెళ్లి స్వామీజీ ఆశీర్వాదం పొందారు.

అరాచకపాలనకు చరమగీతం పాడుదాం: బీకే


మాట్లాడుతున్న బీకే పార్థసారథి

రొద్దం, మార్చి 29: రాష్ట్రంలోని అవినీతి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు కంకణబద్ధులు కావాలని టీడీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారథి పిలుపునిచ్చారు. మండలంలోని ఆర్.మరువపల్లి పార్థసారథి రైస్ మిల్లులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకున్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, దుర్మార్గుల దుష్టుల పాలనను అంతమొందిద్దామని, ఇసుక, మద్యం, మైన్స్‌లలో వేల కోట్లు దోచుకున్న ఘనచరిత్ర వైసీపీదేనన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుని గ్రామంలో ప్రచారం చేయాలని బీకే సూచించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సవిత మాట్లాడుతూ సమాజమే దేవాలయం, ప్రజలేదేవుళ్లు అన్న నినాదంతో దివంగత ముఖ్యమంత్రి ఎన్టీరామారావు తెలుగురాష్ట్రాల ప్రజల కోసం పరితపించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే మహిళా సాధికారత కోసం చంద్రబాబు నాయుడు ఎంతో కృషిచేశారన్నారు. ఎంతో మంది నాయకులు మారినా టీడీపీ కార్యకర్తలు మారలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చారన్నారు. తనను సైతం అక్రమ కేసుల్లో ఇరికించారన్నారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నప్పయ్య, అధికార ప్రతినిధి నరసింహులు, కన్వీనర్ నరహరి, మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, చంద్రమౌళి, వెంకటరామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహులు, హరీష్, మురళి పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీలోకి

నారనాగేపల్లి, కనుమర గ్రామాలకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి బీకే పార్థసారథి, సవిత ఆహ్వానించారు. శుక్రవారం ఆర్.మరువపల్లిలోని రైస్ మిల్లులో వైసీపీ కుటుంబ సభ్యులను టీడీపీలోకి కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో నారనాగేపల్లి మాజీ డీలర్ నాగిరెడ్డి, వలంటీరు రాజశేఖర్, విద్యాకమిటీ చైర్మన్లు సోమిరెడ్డి, మాజీ చైర్మన్ సుబ్బరాయుడు, గోపాల్, యుగంధర్, వీరాంజి, అంజినప్ప, రఫీ, కుమార్, ముత్యాలప్ప, రుద్రన్న, కనుమర గ్రామం నుంచి లక్ష్మయ్య, సోమశేఖర్, సంజీవప్ప, లక్ష్మీనారాయణ, వార్డుమెంబర్ హనుమంతు, చిన్న అంజినప్ప, లక్ష్మన్న, రాము తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో నారనాగేపల్లి మాజీ సర్పంచ్ నాగభూషణం, మనోహర్, గోవిందు, హనుమంతు పాల్గొన్నారు.

అంబికాకు టిక్కెట్ రావడంతో సంబరాలు


సురేంద్ర, శ్రీనివాసరావుకు మిఠాయిలు తినిపిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, మార్చి 29: టీడీపీ అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ పేరు ఖరారు కావడంతో శుక్రవారం హిందూపురంలో ఆ పార్టీ నాయకులు, వాల్మీకులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. అంబికాకు టికెట్ ప్రకటించిన వెంటనే నాయకులు, వాల్మీకులు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నివాసం వద్దకు పెద్దఎత్తున చేరుకుని టపాసులు పేల్చారు. బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డా.సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావును కలిసి అభినందించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ టీడీపీలో వాల్మీకులకు సముచిత స్థానం కల్పించాలని హిందూపురానికి చెందిన వాల్మీకి కులస్థునికి ఎంపీ టికెట్ ఇవ్వడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతపురం జిల్లాలో పోటీచేస్తున్న అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు జయరాం, కాలవ శ్రీనివాసులును గెలిపించుకోవడానికి శాయశక్తులా పనిచేస్తారన్నారు.

వాల్మీకులను గుర్తించడం సంతోషకరం

హిందూపురం అర్బన్: తెలుగుదేశం పార్టీ అనంత జిల్లాలో వాల్మీకులను గుర్తించి రెండు ఎమ్మెల్యే ఒక ఎంపీ సీటు కేటాయించడం సంతోషకరమని వాల్మీకి సంఘం నాయకులు న్నారు. శుక్రవారం టీడీపీ విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో వాల్మీకులకు అనంత జిల్లాలో మూడు సీట్లు కేటాయించారన్నారు. రాయదుర్గానికి కాలవ శ్రీనివాసులు, గుంతకల్లుకు గుమ్మనూరు జయరాం ఎమ్మెల్యేలుగా, అంబికా లక్ష్మీనారాయణకు అనంతపురం టిక్కెట్‌పై హర్షం వ్యక్తం చేశారు.

పగిలిన పైప్‌లైన్.. వృథాగా తాగునీరు..

● పట్టించుకోని మున్సిపల్ అధికారులు


రైల్వే గేటువద్ద పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న తాగునీరు

పెనుకొండ రూరల్, మార్చి 29: అసలే వేసవి.. తాగునీటి లీకేజీని అరికట్టాల్సిన మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోవడంతో ప్రజలు నీటికోసం నానా అవస్థలు పడుతున్న సంఘటన పెనుకొండలో చోటు చేసుకుంది. పట్టణానికి సమీపంలోని తిమ్మాపురం వెళ్లే రహదారిలో రైల్వేగేటువద్ద తాగునీటి పైప్‌లైన్ పగిలి నీరంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పట్టణవాసులకు, సమీప గ్రామాలకు తాగునీటిని అందించాలని దృఢ సంకల్పంతో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బీకే పార్థసారథి చొరవతో రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ వేసి తాగునీటిని అందించారు. వారం రోజులుగా పైప్‌లైన్ తిమ్మాపురం వెళ్లే రైల్వే గేటువద్ద పగిలి నీరంతా వృథా అవుతోంది. అనంతపురం, బెంగళూరుకు వెళ్లే రోడ్డుపై లీకేజీ నీటితో మోకాలిలోతు గుంతలు ఏర్పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. వైసీపీ పాలనలో నగర పంచాయతీ అధికారులు పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


గోరంట్లలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ, మార్చి 29: స్థానిక బైబిల్ మిషన్‌చర్చిలో గుడ్‌ఫ్రైడేను పాస్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం క్రైస్తవులు చర్చివద్దకు చేరుకుని యేసుక్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసుకుంటూ ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ సుధాకర్ మాట్లాడుతూ క్రీస్తు అనగానే క్షమ, కరుణ, గుణాలు గుర్తుకొస్తాయన్నారు. పాపులను పరిశుద్ధులు చేసేందుకు కరుణామయుడైన యేసు ప్రభువు తన ప్రాణాలను వదిలిన రోజే గుడ్‌ఫ్రైడే అన్నారు.


పెనుకొండ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

అన్నదానం

గోరంట్ల: మండలంలోని ఎముకలగుట్టపల్లి కొత్తకాలనీలోని యశోవానిషీ చర్చిలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. టీడీపీ మైనార్టీ యువనాయకుడు ఉమ్మర్‌ఖాన్ కుమారుడి జన్మదినం సందర్భంగా, గుడ్‌ఫ్రైడే కార్యక్రమానికి హాజరైన క్రిస్టియన్లకు భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ విజయ్ రిచర్డ్, విక్టర్, ప్రణీత్‌నిహార్, నాయకులు శ్రీనివాసులు, జయరాం, శీనానాయక్, వాల్మీకి సోము, ఫయాజ్, బీజేపీ శ్రీనివాసులు, ముంతాజమ్మ, శంకర్, షబ్బీర్, జనసేన సంతోష్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

టీడీపీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెనుకొండలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీకే పార్థసారథి, సవిత పార్టీ జెండాలను ఆవిష్కరించారు. మడకశిరలో ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్‌కుమార్, హిందూపురంలో ఎమ్మెల్యే నివాసంలో ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవం కోసం పుట్టింది తెలుగుదేశం పార్టీ అని పలువురు నాయకులు అన్నారు.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


పెనుకొండలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీకే పార్థసారథి


పెనుకొండలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సవిత


మడకశిరలో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో..


హిందూపురం బిసలమానేపల్లిలో...


ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు


చిలమత్తూరులో...


గోరంట్లలో...

సజావుగా సునీల్‌కుమార్ ఎన్నికల ప్రచారం


నారింజ కాయల మాలతో సునీల్‌కుమార్‌ను సన్మానించిన అభిమానులు

రొళ్ల, మార్చి 29: ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ మండలంలోని హొట్టిబెట్ట గ్రామంలో మారమ్మ దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అక్కడి నుంచి హొట్టేబెట్ట, కొడగార్లగుట్ట, టి.డి.పల్లి, అగ్రహారం, మల్లసముద్రం, బి.జి.హళ్ళి, మల్లినమడుగు, హెచ్.టి.హళ్లి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రచారం చేశారు. ఆయనకు నారింజపండ్ల గజమాలతో మల్లసముద్రం టీడీపీ నాయకులకు సత్కరించారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న, వక్కలిగ కన్వీనర్ వి.ఎం.పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, డైరెక్టర్ నారాయణప్ప, సీనియర్ నాయకులు మారుతీప్రసాద్, కె.ఎస్.పల్లి సురేష్, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, శివరుద్రప్ప, కుమారస్వామి, రామకృష్ణ, నాగోజీ, ఈరక్యాతరాయప్ప, మధూడి మంజునాథ, శ్రీనివాస్, దొడ్డలింగప్ప, రవికుమార్, డైరెక్టర్ రామన్న పాల్గొన్నారు.

అదుపుతప్పి కొండను ఢీకొన్న కంటైనర్

పెనుకొండ రూరల్, మార్చి 29: పట్టణానికి సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం కంటైనర్ అదుపుతప్పి కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు బీహార్‌కు చెందిన అన్సార్‌సాదిక్ స్వాతి ట్రాన్స్‌పోర్ట్ కంటైనర్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్ మీదుగా బీహార్‌కు తరలిస్తున్నాడు. మార్గమధ్యంలో పులేకమ్మ గుడివద్దకు రాగానే వాహనం అదుపుతప్పి కొండను ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన డ్రైవర్‌ను కంటైనర్‌లోంచి బయటకు తీసి 108సాయంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా కంటైనర్‌ను పక్కకు తొలగించారు.

అనంతలో యువతి ఆత్మహత్య

అనంతపురం క్రైం, మార్చి 29: నగరంలోని సాయినగర్‌లో నివాసముంటున్న శ్రీజ(22) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. ఓ ఇంజెక్షన్ తీసుకొని మృతి చెందినట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం మద్దనహళ్లికి చెందిన శ్రీజ నగరంలోని కేర్ అండ్ క్యూర్ ఆసుపత్రిలో అనస్థీషియా టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. సాయినగర్ మూడో క్రాస్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో తన సోదరితో కలిసి ఉంటోంది. శుక్రవారం ఉదయం టిఫిన్ చేసిన తరువాత ఇంజెక్షన్ తీసుకున్నట్లు సమాచారం. అపస్మారక స్థితిలో ఉన్న శ్రీజను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై టూటౌన్ పోలీసులు ఆరా తీస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ క్రాంతికుమార్ తెలిపారు.

ఉరివేసుకుని వ్యక్తి...

మడకశిర రూరల్ మార్చి 29: మండలంలోని ఎగువ అచ్చంపల్లి గ్రామ సమీపంలో సోమశేఖర్(45) అనే వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపారు. మడకశిర పట్టణానికి చెందిన సోమశేఖర్ తాగుడుకు బానిసై, కుటుంబ పోషణ భారమై జీవితంపై విరక్తిచెంది శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్య సుబ్బలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో, బొలెరో ఢీ.. ఐదుగురికి గాయాలు

మడకశిర రూరల్ మార్చి 29: మండలంలోని అర్ అనంతపురం గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి ఆటోను బొలెరో ఢీకొన్న ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాలు మేరకు మడకశిర నుంచి ఆటో ప్రయాణికులతో కర్ణాటక రాష్ట్రం వెంకటాపురం గ్రామం వెళుతోంది. వెనుక నుంచి వేగంగా వచ్చి బొలెరో ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్రగంగా గాయపడిన ఐదుగురిని స్థానికులు మడకశిర ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల జోక్యంతో వీధినపడిన కుటుంబం

హిందూపురం, మార్చి 29: నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్లో ఒక దుకాణానికి సంబంధించిన వివాదంలో పోలీసులు జోక్యం చేసుకోవడంతో వ్యాపారి ముఖ్రం కుటుంబం వీధినపడింది. శుక్రవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కూరగాయల మార్కెట్లో దుకాణం విషయంలో తనకు జాకీర్ అనే వ్యక్తికి వివాదం నడుస్తోందని ముఖ్రం తెలిపాడు. ఈ విషయంలో వన్‌టౌన్ ఎస్ఐ ఆరుణ్‌బాషా జోక్యం చేసుకొని అన్యాయం చేశాడంటూ ఆయన ఆరోపించారు. సమస్యపై స్టేషన్లో ఫిర్యాదు చేసినా తమవైపు న్యాయమున్నా జాకీర్ అనే వ్యక్తికే ఎస్ఐ వత్తాసు పలుకుతున్నాడని ఆరోపించారు. అధికార పార్టీ నాయకులు కొంతమంది చెప్పిన మాటలను పోలీసులు విని ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు.

వ్యక్తిపై దాడి.. ఐదుగురిపై కేసు నమోదు

పెనుకొండ రూరల్, మార్చి 29: మహిళను వేధించడం సరికాదని, పద్ధతి మర్చుకోమని చెప్పినందుకు బాలాజీ అనే వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని మునిమడుగు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. కియా పోలీస్ స్టేషన్‌లో ఐదుగురిపై కేసు నమోదు అయినట్లు ఎస్ఐ రంగడు తెలిపారు. మునిమడుగు గ్రామానికి చెందిన సంధ్య మూర్తి దంపతులు ఉన్నారు. సంధ్యను అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి రోజూ ఫోన్ ద్వారా మెసేజ్ పంపి మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయంపై సంధ్య భర్త మూర్తితో చెప్పడంతో ఇద్దరి మధ్య కుటుంబ కలహాలు తలెత్తాయి. మూడు రోజుల క్రితం సంధ్య మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. విషయం తెలుసుకున్న సంధ్య బావ బాలాజీ శుక్రవారం గ్రామంలో నరసింహ మూర్తి బంధువుల వద్దకు వెళ్లి పద్ధతి మార్చుకోమని తెలపడంతో వారిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో బాలాజీపై చాపల నరసింహులు, గుర్రప్ప, పవన్, నరేష్ దాడిచేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే మనుగడ

రొళ్ల, మార్చి 29: ప్రతి ఒక్కరు సమష్టిగా పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటేనే పార్టీకి మనుగడ అని రైతు అధికార ప్రతినిధి కె.ఎస్.పల్లి సురేష్ అన్నారు. శుక్రవారం నాయకులతో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మడకశిర నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా సునీల్‌కుమార్ పోటీలో ఉంటారని రెండు రోజుల క్రితం చంద్రబాబు స్పష్టంగా హామీ ఇచ్చారని తెలిపారు.